క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని 17వ వార్డులో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలశ్రీనివాస్, కౌన్సిలర్లు ఇమ్రాన్ ఉజమా, మారేపల్లి సుశీల, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం, సీపీఆర్‌పై ప్రజలను చైతన్యపర్చాలి



రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రామడుగు: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం, సీపీఆర్‌పై ప్రజలను చైతన్యపర్చాలని రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఎస్ఆర్ఆర్ కళాశాల యూనిట్-4 ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ సాయిశరణ్ వలంటీర్లు, విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, ప్రోగాం అధికారి సురేష్‌కుమార్, హెచ్ఎం కమల, టీచర్లు పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన



వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం వరిపొలాలను వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. వరిలో మెడ విరుపు, కంకినల్లి సోకినట్లు గుర్తించామని, నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

జమ్మికుంట: పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జమ్మికుంట, హుజూరాబాద్ (ఐఎంఏ)అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలతో వైద్యులు నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజస్తాన్ ప్రభుత్వం ప్రైవేట్ వైద్యులు ఉచితంగా వైద్యం చేయాలని చట్టం తెచ్చిందని, అందుకు నిరసనగా దేశవ్యాప్తంగా బ్లాక్ డే పాటించాలని అసోసియేషన్ నిర్ణయం తీసుకుందన్నారు. ఎలాంటి జీతం, ఆదాయం మార్గం చూపకుండా ఉచితంగా వైద్యం చేస్తే, వైద్యుల కుటుంబ జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని లేదంటే నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్లు అంకం సుధాకర్, ఉడుగుల సురేష్, లావణ్య, సురంజన్, కిషోర్, ముషం ప్రణీత, సురేష్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2న వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ సమావేశం



రాజగోపాల్‌తో సత్యరాజ్‌వర్మ, తదితరులు

చొప్పదండి: వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ అత్యవసర సమావేశం ఏప్రిల్ 2వ తేదీన గంగాధరలో ఏర్పాటు చేశామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ తెలిపారు. సోమవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాడుక రాజగోపాల్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించినట్లు తెలిపారు. వెంట జగిత్యాల మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, న్యాయవాది ఎడవెల్లి భూమేశ్, కల్లెపల్లి రమేశ్, దాసరి రవిశాస్త్రి, చంద్రయ్య, సత్యనారాయణ, కవిత ఉన్నారు.

ఎన్నాళ్లీ.. ఇబ్బందులు

- ఇసుక లారీలు, ట్రాక్టర్లతో.. రహదారులు ఛిద్రం
- దుమ్ము ధూళితో ఇక్కట్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



మానకొండూర్‌లో గుంతలమయంగా రహదారి



ఇసుక లారీలతో రద్దీగా ఉన్న రోడ్డు

మానకొండూర్: సాండ్ టాక్స్ పేరిట ప్రభుత్వానికి ఆదాయం వస్తుండగా ప్రజలకు శాపంగా మారింది. వందలాది లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా రహదారులు ఛిద్రమవుతున్నాయి. అధికలోడుతో రహదారులు పగుళ్లుబారుతూ దెబ్బతింటున్నాయి. గ్రామీణ ప్రాంతాల సౌకర్యార్థం వేసిన రహదారులు అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

అధికలోడుతో పగుళ్లు

మానకొండూర్ మండల పరిధిలోని జగ్గయ్యపల్లి, శ్రీనివాస్‌నగర్, లింగాపూర్, వెల్ది వేగురుపల్లి, ఊటూరు వరకు మానేరు వాగు ప్రవహిస్తోంది. మానేరు వాగుకు ఇరువైపులా లింగాపూర్ శివారు వరకు మానేరు రివర్ ఫ్రంట్, అలాగే జగ్గయ్యపల్లి, వేగురుపల్లి, ఊటూరు మానేరు వాగుపై చెక్ డ్యాంల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు ఇక్కడి నుంచి ఇసుకను తరలించేందుకు లింగాపూర్, ఊటూరు, జగ్గయ్యపల్లి, శ్రీనివాస్, వెల్ది శివారులోని ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. ఇక్కడినుంచి నిత్యం వందలాది వాహనాలు ఇసుకను లారీలు, ట్రాక్టర్ల ద్వారా పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికలోడుతో వెళ్తుండటంతో రహదారి పగుళ్లుబారుతుంది. పలుచోట్ల గుంతలమయమైంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండడంతో గ్రామాల ప్రజలు ఈ దారిగుండా వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నారు. రహదారులు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

దుమ్ముతో నిండుకుంటున్న గ్రామాలు

నిత్యం వందలాది ట్రాక్టర్లు, లారీలు ఇసుక రీచ్ నుంచి ఇసుకను రాత్రింబవళ్లు రహదారి గుండా తరలిస్తుండగా మానేరు వాగువెంట ఉన్న గ్రామాలే కాకుండా మానకొండూర్, అన్నారం, రాఘవపూర్, లక్ష్మీపూర్ గ్రామస్తులు సౌండ్ పొల్యూషన్, దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతుండడమే కాకుండా అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాస్తారోకో, అడ్డగింతలు

ఇసుక లారీలు, ట్రాక్టర్లతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని, అన్నారం, మానకొండూర్ గ్రామస్తులు ధర్నా, రాస్తారోకోలు చేస్తున్నారు. దుమ్ము ధూళి లేవకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. మానకొండూర్ మండలకేంద్రంలో తూర్పు దర్వాజ నుంచి పల్లె మీద వరకు తారురోడ్డు వేయిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా ఇంతవరకు పూర్తికాలేదని మండిపడుతున్నారు. కాగా ఆది, సోమవారాల్లో గ్రామస్తులు రాస్తారోకో, ధర్నా చేశారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి, ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోవతే ఇసుక లారీలను అడ్డుకుంటామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

నిద్రపట్టడం లేదు



మానేరు వాగులోని ఇసుక రీచ్‌ల నుంచి నిత్యం ఇసుకను లారీల్లో తరలిస్తుండగా, శబ్ద కాలుష్యంతో నిద్రపట్టడం లేదు. దుమ్ము ధూళి విపరీతంగా వస్తుండడంతో అనారోగ్యానికి గురవుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో వేసిన రహదారులు పాడైపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేయాలి.

– ఎరవేని పర్శరాములు

రైతుల సహకారంతోనే అభివృద్ధి



సైదాపూర్: మాట్లాడుతున్న కొత్త తిరుపతిరెడ్డి



శంకరపట్నం: మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

సైదాపూర్: రైతుల సహకారంతో వెన్కెపల్లి విశాల సహకార సంఘం అభివృద్ధి చెందుతోందని సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం సంఘం వార్షిక మహాసభలో తిరుపతిరెడ్డి మాట్లాడారు. ఇప్పటివరకు రూ.7.60 కోట్ల స్వల్ప, రూ.27 లక్షల దీర్ఘకాలిక రుణాలు అందించామని, ధాన్యం కొనుగోళ్లలో కమీషన్ రూపంలో రూ.3.50 కోట్లు సంఘానికి సమకూరాయని, ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్లు రావాల్సి ఉందని, ఈ నిధులతో పెట్రోల్‌బంక్, గోదాములు నిర్మిస్తామని, స్థల సేకరణ కూడా చేశామన్నారు. సంఘం నూతన కార్యాలయం, రైతుశిక్షణ కేంద్రం నిర్మాణం జరుగుతోందన్నారు. ధాన్యం అమ్ముకునేటప్పుడు మిల్లర్లు రైతులను నిండా ముంచుతున్నారని, సంఘం ఎలాంటి సహాయం చేయడంలేదని జాగీర్‌పల్లి రైతు బొల్లెవేని శంకర్ పాలకవర్గాన్ని నిలదీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పలువురు డైరెక్టర్లు సూచించారు. సభలో వైస్ చైర్మన్ కిషన్‌రావు, డైరెక్టర్లు రాజు, జమున, జయకృష్ణ, ప్రవీణ్‌రావు, తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి,ప్రకాశ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మి, సీఈవో శ్రీధర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సహకార సంఘం సభ్యులకు ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలుకు ఎకరాకు రూ. 10 వేల రుణం అందిస్తామని విండో చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. తాడికల్, గద్దపాక సహకార సంఘాల వార్షిక మహాసభ చైర్మన్లు మధుకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంఘాల ఆర్థిక లావాదేవీలను సీఈవోలు వివరించారు. ధాన్యంలో కోత విధించకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. గద్దపాక పాలకవర్గం గోవా టూర్‌పై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుల సహకారంతో సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని, రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి అభివృద్ధికి పాటుపడాలని చైర్మన్లు సభ్యులకు సూచించారు. సర్పంచులు వసంత, మల్లయ్య, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, సీఈవోలు వేణుమాధవ్, శ్రీనివాస్, స్టాఫ్ అసిస్టెంట్ వీరస్వామి, మాజీ చైర్మన్లు, మాజీ సర్పంచులు, రైతులు, పాకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



గంగాధర: మండలంలోని గట్టుబూత్కూర్ గ్రామానికి చెందిన బొల్లబత్తిని కృష్ణహరి, మిడిదొడ్డి అంజయ్య ఇటీవల మృతిచెందారు. సోమవారం కొత్త జయపాల్‌రెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో రూ.5 వేల చొప్పున ఇరువురి కుటుంబాలకు సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు.

చిరుధాన్యాలపై అవగాహన, ర్యాలీ



రాగిజావ అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



గద్దపాకలో సైకిల్ ర్యాలీ

రామడుగు: మండలంలోని గుండి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను అందజేస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరుధాన్యాలతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు రక్త పరీక్షలు చేసి రాగి జావ అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌అభియాన్‌లో భాగంగా సైకిల్ ర్యాలీ తీశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కరుణ, విద్యార్థులు, వైద్యసిబ్బంది, గ్రామ పంచయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో అధిక ప్రయోజనం

హుజూరాబాద్‌రూరల్: ప్రతిరోజు మిల్లెట్స్ తీసుకోవడం వల్ల శరీరానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని హుజూరాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. సోమవారం పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో మిల్లెట్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు తీసుకోవాలని బియ్యం తగ్గించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం తిరుపతి, సూపర్‌వైజర్ శివశోభ, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి రాణి, సులోచన, సుకన్య, మండల సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ప్యాడ్‌లు అందిస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి



శంకరపట్నం: విద్యార్థులతో రమణయ్య

వీణవంక: విద్యార్థులు ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నెంబర్లు 100, 181, 1098, 1930 పైఅవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు మీకోసం కార్యక్రమంలో భాగంగా నెంబర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నెంబర్లు కలిగిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, వాటర్ బాటిల్స్ విద్యార్థులకు అందజేశారు. అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక, వరకట్న వేధింపులు, బాల్య వివాహలు, బాల కార్మికులు, అక్రమ రవాణా, గృహహింస, సైబర్ నేరాల గురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్‌ల ద్వారా సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కల కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులకు కనకం కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకుడు రమణయ్య పరీక్ష సామగ్రి అందించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో సాయికుమార్, కొంరయ్య, టీచర్ శారద, తదితరులున్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి

చొప్పదండి: మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు పదమూడో వార్డును దత్తత తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఈమేరకు సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు సునీల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికులు డిమాండ్ చేశారు. వార్డు పరిధిలో చెత్తాచెదారం పేరుకుపోతోందని, పారిశుధ్యం, మురుగుకాలువలు, కరెంట్ స్తంభాల ఏర్పాటు, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పన్నుల వసూలుపై స్పెషల్ డ్రైవ్



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, తదితరులు

చొప్పదండి: పన్నుల వసూలు వేగవంతం చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ శాతికుమార్ తెలిపారు. పట్టణంలోని పన్నెండో వార్డులో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల సహకారంతో వసూలు చేస్తున్నామని, గడువు దాటితే బకాయిదారులకు వడ్డీ పడుతుందని, వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. మొండి బకాయిదారుల జాబితా ముఖ్య కూడళ్లలో ప్రదర్శిస్తామని హెచ్చరించారు. మున్సిపల్, రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం బకాయిదారుల ఆస్తులను జప్తు చేసే అధికారం ఉందన్నారు. వాణిజ్య గృహాలు, రైస్ మిల్లులు, పాఠశాలలు, కళాశాలల బకాయిలు చెల్లించాలని సూచించారు. వెంట మేనేజర్ ప్రశాంత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, కౌన్సిలర్‌లు మాదూరి శ్రీనివాస్, కొత్తూరి మహేశ్, నాయకులు మహేషుని మల్లేశం, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, దండె క్రిష్ణ, నలుమాచు రామక్రిష్ణ, యండి ఖాజాఅలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యంతో అభివృద్ధి



రాజపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సిద్ధార్థ

హుజూరాబాద్‌రూరల్: పేదలకు ఉచిత విద్య, వైద్యం అందినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఉచితంగా అందించాలని కోరుతూ చేపట్టిన చైతన్య పాదయాత్ర సోమవారం మండలంలోని రాజపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులనిద్దేశించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉచిత విద్య, వైద్యం అందిస్తున్న దేశాలు అగ్రరాజ్యాలుగా ఎదిగాయని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన సాధ్యమైందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానన్న సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చారని, ఏటా విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కులాల పేరిట గురుకులాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో కులవివక్ష పెంచుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

29న తైబజార్ (అంగడి) వేలం

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో తైబజార్ (అంగడి) బహిరంగ వేలం 29న నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల క్రితం వేలం నిర్వహించామని, వేలం తక్కువ రావడంతో వాయిదా వేశామని, తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఏదైన జాతీయ బ్యాంక్ నుంచి రూ. రెండు లక్షల డీడీ, రూ. 20 లక్షలకు సాల్వెన్సీ సర్టిఫికెట్, నో డ్యూ సర్టిఫికెట్ జతపరిచి, 28వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

డైయిరీని సందర్శించిన వినోద్‌కుమార్



నల్లగొండలోని డైయిరీని సందర్శిస్తున్న బోయినపల్లి వినోద్ కుమార్

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండలో నిర్మించిన ఆటోమేటెడ్ మెగా డైయిరీ ప్రాజెక్టును ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సోమవారం సందర్శించారు. అన్ని విభాగాలను అడిగి తెలుసుకున్నారు. మూడు లక్షల లీటర్ల సామర్థ్యం గల అతిపెద్ద డైయిరీ అని డైయిరీ చైర్మన్ చెల్మెడ రాజేశ్వర్‌రావు వివరించారు. డైయిరీ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్‌ను తీసుకురావాలని వినోద్‌కుమార్‌ను కోరారు. సానుకూలంగా స్పందించి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీఆర్, నాబార్డ్ జనరల్ మేనేజర్ హరిగోపాల్, ఆనంద్, సత్యనారాయణ, నుస్తులాపూర్ సర్పంచ్, మాజీ సర్పంచులు రావుల రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి' లెక్చరర్‌కు డాక్టరేట్



కె. ప్రసన్నలత

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ కె.ప్రసన్నలత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 'డెవలపింగ్ ది రీడింగ్ అండ్ రైటింగ్ స్కిల్స్ ఇన్ ది జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ఇన్ కరీంనగర్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై డాక్టరేట్ (పీహెచ్‌డీ పట్టా) పొందారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ విద్యార్థులపై అధ్యయనం చేసి విద్యాభ్యున్నతికి ఉపయోగపడేలా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ కేంద్రంగా 40 గంటల ఇంటర్వెన్షన్ ప్రోగ్రాం (ట్రైనింగ్)ను రూపొందించారు. పొందుపరిచిన థీసిస్‌లో స్టాటిస్టికల్ ప్యాకేజ్ ఫర్ సోషల్ సైన్సెస్‌లోని క్రాస్టాబులేషన్, కై- స్క్వేర్ టెస్ట్, వన్ వే ఆనోవా మొదలగు టూల్స్‌ని ఉపయోగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే గ్రామీణ నిరుపేద విద్యార్థులకు సేవ చేయాలనేది తన ఉన్నత లక్ష్యమన్నారు. విద్యా బోధన అంటే మక్కువతోనే రెండు దశాబ్దాలుగా ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా ఎంతోమంది విద్యార్థులకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు.

పంచాయతీలకు అవార్డులు



గన్నేరువరం: అవార్డుతో సర్పంచ్ మల్లీశ్వరి, ఎంపీడీవో

జిల్లాకేంద్రంలో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని వివిధ గ్రామ పంచాయతీలకు ఆయా విభాగాల్లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు రాగా సర్పంచులు అందుకున్నారు. జమ్మికుంట మండలం పాపక్కపల్లి,చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి, కొండాపూర్, రామడుగు మండలం వెలిచాల శంకరపట్నం మండలం ముత్తారం, ధర్మారం, గన్నేరువరం మండలం ఖాసీంపేట,సైదాపూర్ మండలంలోని గొడిశాల, తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామానికి రికార్డుస్థాయిలో ఐదు పురస్కారాలు వరించాయి. ఒకే ఏడాది గ్రామ పంచాయతీకి ఆరోగ్య పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్, వ్యక్తిగత అవసరాల తీర్చే వనరులు, సామాజిక రక్షణ, మహిళా స్నేహిత విభాగాలకు ఎంపికైంది. అలాగే నుస్తులాపూర్ మహిళా స్నేహ పూర్వక గ్రామంగా ఎంపికైంది.

– సాక్షి నెట్‌వర్క్

ఆధ్యాత్మికం

పంచముఖాంజనేయస్వామి ఆలయంలో పూజలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో షష్టితిథిని పురస్కరించుకుని శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం పంచామృతాలతో అభిషేకం, శ్రీ పూజ్య గురు హనుమేశ్ స్వామీజీ చేతుల మీదుగా అత్యంత వైభవంగా పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడం విశేషం. కార్యక్రమంలో న్యాయవాదులు బద్దిపడగ రాజిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు కొలుగూరి మోహన్‌రెడ్డి, పోలోజు సంతోష్‌కుమార్, తేరాల అమర్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

రామడుగులో వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర నాటకం



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

రామడుగు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక కళా మండలి, రామడుగు ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. 69 సంవత్సరాలుగా ఏటా చైత్ర శుద్ధ పంచమి రోజున జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో అత్యంత వైభవంగా ప్రదర్శించడం జరుగుతోంది. ప్రదర్శనను తిలకించడానికి మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు జిల్లా కేంద్రం నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి నాటకం వీక్షించారు.